

నేడే పింఛన్ల పండగ

● ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా అధికారులు ● ఉదయం ఆరు గంటల నుంచి ప్రారంభం

● ఇంటి వద్దకే రూ.7వేలు అందజేత ● తొలిరోజు శతశాతం పంపిణీకి చర్యలు

● జిల్లాలో 1.44 లక్షల మందికి లబ్ధి ● ఇచ్చిన హామీని అమలు చేస్తున్న సీఎం చంద్రబాబు

● హర్షం వ్యక్తం చేస్తున్న పింఛన్‌దారులు



(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

పింఛన్ల పండగకు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయాన్నే పెంచిన పింఛన్లు అందించేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటివరకు అందుతున్న రూ.3 వేలకు అదనంగా పెంచిన రూ. వెయ్యి.. గత మూడు నెలల బకాయి రూ.3 వేలు.. మొత్తం రూ.7 వేలను ఎన్టీఆర్ భరోసా పథకం కింద సామాజిక పింఛన్‌దారులకు అందజేయనున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు, ఇతర విభాగాల సిబ్బంది పింఛన్ దారుల ఇంటి వద్దకు వెళ్లి ఆ మొత్తం అందించ నున్నారు. దీనికి సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలిరోజు శతశాతం పింఛన్లు పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేసింది. పింఛన్ల పంపిణీ పర్యవేక్షణకు ప్రత్యేక టీమును కూడా ఏర్పాటు చేసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం చంద్రబాబు పెంచిన మొత్తంతో పింఛన్లు అందిస్తుండడంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా..

● జిల్లాలోని పార్వతీపురం నియోజకవర్గంలో 38,947 మంది సామాజిక పింఛన్‌దారులు ఉన్నారు. బలిజిపేటలో 10,974, పార్వతీపురంలో 11,020, పార్వతీపురం అర్బన్‌లో 5,526, సీతానగరం మండలంలో 11,427 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్లు అందించనున్నారు. ఇందుకోసం సుమారు రూ.25.65 కోట్లు కేటాయించనున్నారు.

● కురుపాం నియోజకవర్గం గరుగుబిల్లి మండలంలో 8,367, గుమ్మలక్ష్మీపురంలో 6,737, జియమ్మవలస మండలంలో 9,090, కొమరాడ 8,562, కురుపాంలో 7,005 మంది లబ్ధిదారులున్నారు. మొత్తంగా 39,758 మంది పింఛన్‌దారులకు సుమారు రూ. 26.60 కోట్లు పంపిణీ చేయనున్నారు.

● సాలూరు నియోజకవర్గం మక్కువ మండలంలో 8,520, పాచిపెంటలో 6,909, సాలూరులో 8,515, సాలూరు అర్బన్‌లో 5,858 మంది పింఛన్‌దారులు ఉన్నారు. మొత్తంగా 29,802 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 20.23 కోట్లు పంపిణీ చేయనున్నారు.

● పాలకొండ నియోజకవర్గం భామిని మండలంలో 7,056, పాలకొండలో 7,397, పాలకొండ అర్బన్‌లో 3,463, సీతంపేటలో 8,135, వీరఘట్టంలో 9,954 మంది పింఛన్‌దారులున్నారు. మొత్తంగా 36,005 మందికి సుమారు రూ.24.19 కోట్లను పంపిణీ చేయనున్నారు. మొత్తంగా ఎన్టీఆర్ భరోసా కింద సుమారు రూ. 96.69 కోట్లను పింఛను రూపంలో అందించనున్నారు.

జిల్లాలో 3,200 మంది సిబ్బంది...

జిల్లాలో 15 మండలాలు, రెండు మున్సిపాల్టీలు, ఒక నగరపంచాయతీలో పింఛన్ పంపిణీ సంబంధించి సుమారు 3,200మంది సిబ్బందిని వినియోగించనున్నారు. దీని కోసం ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. సచివాలయ సిబ్బందితో పాటు వివిధ శాఖలకు చెందిన సిబ్బంది పింఛను పంపిణీ కార్యక్రమంలో భాగస్వాములవనున్నారు. జిల్లాలో 350 గ్రామ,వార్డు సచివాలయాలున్నాయి. వాటి సిబ్బందితో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం తదితర ప్రభుత్వ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

మండల కేంద్రంలో ప్రత్యేక టీం...

ప్రతి మండల కేంద్రంలో ఒక ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఎక్కడైనా పింఛన్ల పంపిణీకి సంబంధించి సమస్యలు ఎదురైతే .. మానటరింగ్ టీంకు సమాచారం పంపిస్తే వెంటనే పరిష్కరిస్తారు.

ఆ పుస్తకాలతో పనిలేదు..

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటం ఉన్న పింఛన్ పాస్ పుస్తకాలతో ఇక పనిలేదు. వాటిని పక్కన పెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. సామాజిక పింఛనుదారులకు పింఛన్ అందించే సమయంలో ఆ పుస్తకాలను పరిశీలించాల్సిన అవసరం లేదని తెలియజేసింది.

డిక్లరేషన్ తప్పనిసరి...

సామాజిక పింఛన్ల పంపిణీకి సంబంధించి అవసరమైన డిక్లరేషన్ లబ్ధిదారులు అందించాలి. సామాజిక పింఛను పాస్‌పుస్తకాలు సిద్ధంగా లేకపోవడంతో వాటి స్థానంలో డిక్లరేషన్ ఫారాలను ఏర్పాటు చేశారు. పెన్షన్ ఇచ్చిన వారితో పాటు తీసుకున్న వారు కూడా డిక్లరేషన్‌పై సంతకం తప్పనిసరిగా పెట్టాలి.

పింఛన్‌దారులకు కరపత్రం...

పింఛన్‌దారులకు ముఖ్యమంత్రి సందేశంతో కూడిన ప్రత్యేక కరపత్రం అందించనున్నారు. ఇప్పటికే అవి సచివాలయాలకు చేరుకున్నాయి.

జిల్లాలో లబ్ధిదారులు ఇలా..

కొమరాడ: జిల్లా వ్యాప్తంగా 1,44,518 మంది లబ్ధిదారులు సామాజిక పింఛన్లు పొందుతున్నారు. వీరందరికీ రూ. 96.70 కోట్లు అందించనున్నారు. ఒక్కో సిబ్బంది 50 నుంచి 60 మందికి పింఛన్ అందించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. దివ్యాంగుల పింఛన్‌ను రూ. 3 వేల నుంచి రూ. 6 వేలుకు పెంచారు. దీంతో జిల్లాలో 17,006 మందికి లబ్ధి చేకూరనుంది. పూర్తి వైకల్యం కలిగిన వారికి ప్రతి నెలా రూ. 15 వేలు అందించనున్నారు. పెరాలసిస్ బారిన పడి వీల్ చైర్ మంచానికే పరిమితమైన, వారు తీవ్రమైన కండరాల బలహీనత కేసులు, ప్రమాద బాధితులకు రూ.15 వేల చొప్పున పింఛన్ ఇవ్వనున్నారు. బోధకాలు, మూత్ర పిండాలు, ఊపిరి తిత్తులు, హార్ట్ ట్రాన్స్ ప్లాంటేషన్, డయాలసిస్ రోగులు, తదితరులకు రూ. 5 వేలు బదులు రూ.10 వేలు అందించనున్నారు.

● వృద్ధాప్య పింఛన్లు 79,342, చేనేత పింఛన్లు 766, దివ్యాంగుల పింఛన్లు 17,004, వితంతు పింఛన్లు 34,747, కల్లుగీత కార్మికుల పింఛన్లు 193, ట్రాన్స్ జెండర్స్ పింఛన్లు 129, మత్స్యకార పింఛన్లు 824, ఒంటరి మహిళల పింఛన్లు 2362, చర్మకారుల పింఛన్లు 1873, డప్పు కళాకారులు 1784, కిడ్నీ వ్యాధిగ్రస్తులు 119, వైద్యపరమైన అవసరాల కొరకు పింఛన్లు 660, సైనిక సంక్షేమ పింఛన్లు 4, సంప్రదాయ కళాకారులు 133, అభయ హస్తం పింఛన్‌దారులు 4577 మందికి పింఛన్లు అందించనున్నారు. వారి పింఛన్ రూ. 3 వేల నుంచి రూ. 4 వేలకు పెంచారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో బకాయిగా ఉన్న రూ. 3 వేలు కలిపి ఒక్కొక్కరికీ రూ. 7 వేల చొప్పున పింఛన్ అందించనున్నారు.

శత శాతం పంపిణీకి ఏర్పాట్లు....

తొలిరోజు వంద శాతం పింఛన్లు పంపిణీ చేయాలని ఇప్పటికే కలెక్టర్ నిశాంత్‌కుమార్ సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పింఛన్ల పంపిణీలో ఎక్కడైనా నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హెచ్చరించారు.

సంబరాలకు కూటమి నేతలు సిద్ధం..

ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం.. సామాజిక పింఛన్లకు రంగం సిద్ధమవడంతో జిల్లాలో కూటమి శ్రేణులు సంబరాలకు సిద్ధమవుతున్నాయి. నాలుగు నియోజకవర్గాల పరిధిలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తదితర చిత్రపటాలకు పాలభిషేకం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి..

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశాం. కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో తొలిరోజు శతశాతం పింఛన్ల పంపిణీ చేయాలని నిర్ణయించాం. ఏమైనా ఇబ్బందులుంటే.. వెంటనే మండ లంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక టీముల దృష్టికి తీసుకెళ్తే.. పరిష్కరిస్తారు. నేటి ఉదయం ఆరు గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుంది. సచివాలయ ఉద్యోగులు పింఛన్‌దారుల ఇంటికి వెళ్లి పెంచిన్ పింఛన్ మొత్తం అందించనున్నారు.

-సత్యంనాయుడు, ఇన్‌చార్జి డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం



ఐదేళ్లూ.. పట్టించుకోలే..

● అధ్వానంగా పార్వతీపురం-పాలకొండ ప్రధాన రహదారి

● స్పందించని గత వైసీపీ సర్కారు

● వాహనదారులకు తప్పని ఇబ్బందులు



ఉల్లిభద్ర సమీపంలో రహదారి ఇలా..

గరుగుబిల్లి: పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా భారీగా గుంతల్లో నీరు చేరడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎంతో కీలకమైన ఈ ప్రధాన రహదారిని గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. తాత్కాలికంగా మరమ్మతులకు ఆర్‌అండ్‌బీ అధికారులు సుమారు రూ.5లక్షలతో ప్రతిపాదనలు చేస్తే రూ.2లక్షలే విడుదల చేశారు. చాలీచాలని నిధులతో అంతంత మాత్రంగానే మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం దారి పొడవునా భారీ గోతులు ఏర్పడడంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర ప్రాంతం తోటపల్లి ప్రాజెకు కుడి ప్రధాన కాలువపై గతంలో నిర్మించిన ప్రధాన కల్వర్టుకు ఆనుకుని ఇరువైపులా భారీగా గోతులు ఏర్పడ్డాయి. ఉన్నతాధికారులు చొరవ చూపి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఫిర్యాదు బాక్సులు

● మంత్రి సంధ్యారాణి



విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు/సాలూరు రూరల్, జూన్ 30: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో సమస్యలను తెలుసుకోవడానికి ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సాలూరు మండలం కొత్తవలసలో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె ఆదివారం ఆకస్మికంగా పరిశీలించారు. తాను మంత్రిగా కాకుండా ఉపాధ్యాయురాలుగా మాట్లాడుతున్నానని.. విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. 'మంత్రిలా కాకుండా అమ్మలా వసతిగృహానికి వచ్చాను. మీ సమస్యలు నాకు తెలియజేయండి. ఏ విషయం లోనూ మీరు భయపడాల్సిన పనిలేదు. శ్రద్ధగా చదువుకోవాలి. తల్లిదండ్రులు తప్ప ఎవరూ వచ్చినా.. బయటకు వెళ్లొద్దు.. రోజులు బాగాలేవు. ఏమైనా సమస్యలుంటే.. ఫిర్యాదు పెట్టెలో వేసి.. నాకు తెలియజేయండి. మీ పేరు రాయకపోయినా పర్వాలేదు.' అని మంత్రి తెలిపారు. అనంతరం విద్యార్థినులతో పాఠ్యపుస్తకాలను చదివించారు. ఎనిమిదో తరగతి విద్యార్థి ఆంగ్లం చదవడంలో నెమ్మదిగా ఉండడం గమనించారు. ఇలాయితే విద్యార్థినులు పదో తరగతిలో ఆంగ్లం ఎలా వేగంగా చదవగలరని హెచ్ఎం సంధ్యారాణిని ఆమె ప్రశ్నించారు. అన్ని సబ్జెక్టుల్లో మెరుగైన విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం మంత్రి డైనింగ్ రూమ్‌కు వెళ్లి.. అక్కడ వంటకాలను పరిశీలించారు. బిర్యాని రుచి చూసి.. ఉప్పు అధికంగా ఉందన్నారు. 630 మంది విద్యార్థినులకు చికెన్ సరిపోతుందా? అని ప్రశ్నించారు. సక్రమంగా మెనూ అమలు చేయాలని సూచించారు. రోజూ మెనూ చార్ట్ పెట్టాలని ఆదేశించారు. వసతిగృహ నిర్వాహణపై అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. విద్యార్థినులను సొంత పిల్లల్లా చూసుకోవాలన్నారు. వసతి గృహంలోకి తల్లిదండ్రులకు తప్ప ఇతరులకు ప్రవేశం ఉండరాదని ఆదేశించారు. త్వరలోనే వసతిగృహాలకు పూర్తి స్థాయిలో వర్కర్లను నియమిస్తామని, ఏఎన్ఎంలు కూడా వస్తారని తెలిపారు.

ఏ సమస్య ఉన్నా చెప్పొచ్చు..

కొత్తవలస పాఠశాలలో తమ పిల్లలను కలవడానికి వచ్చిన తల్లిదండ్రులతో మంత్రి సంధ్యారాణి మాట్లాడారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తనను కలిసి చెప్పొచ్చని వారికి సూచించారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థినులకు ఏమైనా సమస్యలుంటే ఫిర్యాదు పేపర్‌పై రాసి బాక్స్‌లో వేయాలన్నారు. ఈ పరిశీలనలో సాలూరు, మక్కువ మండలాల టీడీపీ అధ్యక్షులు ఆముదాల పరమేశు, గుల్ల వేణుగోపాలరావు, నాయకులు ఆముజూరు శ్రీనివాసరావు, కనక, గణపతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా డీఎస్సీకి నోటిఫికేషన్

● ఆదేశాలు జారీచేసిన ప్రభుత్వం

● ఆనందం వ్యక్తం చేస్తున్న నిరుద్యోగ యువత

సాలూరు రూరల్, జూన్ 30: ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీకి సంబంధించి నేడు నోటిఫికేషన్ విడుదల కానుంది. మరోవైపు గత వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన మినీ డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తు సోమవారం విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో గత డీఎస్సీలో కేవలం 284 ఉపాధ్యాయ పోస్టులను ఖాళీగా చూపారు. దీంతో నిరుద్యోగ ఉపాధ్యాయులు విస్తుపోయారు. ప్రస్తుతం ప్రకటించనున్న మెగా డీఎస్సీలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో 583 ఉపాధ్యాయ ఖాళీలను చూపనున్నారు. ఇందులో 267 ఎస్జీటీ ఖాళీలను చూపనుండడం విశేషం. గతంలో కేవలం 107 ఎస్జీటీ పోస్టులే చూపారు. ఉమ్మడి జిల్లాలో 284 నుంచి 583 ఉపాధ్యాయ ఖాళీలను చూపనుండడంతో నిరుద్యోగ ఉపాధ్యాయ యువత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 41 వేల మంది నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులున్నారు. డీఎస్సీ, టెట్ నోటిఫికేషన్లు రానున్నాయి. గతంలో టెట్ అర్హత సాధించనివారు, ఇటీవల బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన వారికి మేలు చేకూర్చడానికి టెట్ నోటిఫికేషన్ ఇస్తున్నారు. టెట్ పరీక్ష అనంతరం 30 రోజులు వ్యవధితో డీఎస్సీ పరీక్షలను నిర్వహించనున్నారు. టెట్ రాసిన అభ్యర్థులు సన్నద్ధానికి అనుగుణంగా డీఎస్సీని నిర్వహించనున్నారు.



ఇంటికే రేషన్

● డోర్ డెలివరీకి చర్యలు ● వీధుల్లో పంపిణీకి చెల్లు

● ఎండీయూ ఆపరేటర్లకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు

● సర్వం సిద్ధం చేసిన అధికారులు







జియ్యమ్మవలస)

జిల్లాలో రేషన్ కార్డుదారుల కష్టాలు తీరనున్నాయి. నిత్యావసర సరుకుల కోసం ఇక నుంచి వీధి చివర గంటల కొద్దీ నిరీక్షించాల్సిన అవసరం లేదు. ఈనెల నుంచి కార్డుదారుల ఇంటికే రేషన్ అందించాలని టీడీపీ కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డోర్ టు డోర్ డెలివరీ కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని సివిల్ సప్లయిస్ అధికారులకు సూచించింది. ఎండీయూ ఆపరేటర్లతో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం తేల్చి చెప్పింది. దీంతో జిల్లాలో 2,81,151 రేషన్ కార్డుదారులకు లబ్ధి చేకూరనుంది. నూతన ప్రభుత్వం తాజా నిర్ణయంతో జిల్లావాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

● పార్వతీపురం, పాలకొండ డివిజన్లలో 15 మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో 8 ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. ఆఫ్‌లైన్ ఎఫ్‌పీ షాపులు 59, ఆన్‌లైన్ 519 కలిపి మొత్తంగా 578 ఫెయిర్ ప్రైస్ షాపు (ఎఫ్‌పీ షాపు)లు ఉన్నాయి. వీటిల్లో పాలకొండ డివిజన్‌లో 259, పార్వతీపురం డివిజన్‌లో 319 షాపులు ఉన్నాయి. జిల్లాలో 578 మంది రేషన్ డీలర్లు ఉన్నారు. ఇంటింటికి రేషన్ పంచేందుకు అర్బన్‌లో 27 ఎండీయూ ఆపరేటర్లు, రూరల్‌లో 159 మంది ఎండీయూ ఆపరేటర్లు కలిపి మొత్తం 196 మంది ఉన్నారు.

● జిల్లాలో ఎన్ఎఫ్ఎస్ఏ కార్డులు 2,06,794 ఉన్నాయి. అంత్యోదయ అన్నా యోజన కార్డులు 55,959, స్టేట్ కార్డులు 18,518 కలిపి మొత్తం 2,81,251 కార్డులు ఉన్నాయి. వీరందరికీ ఉచితంగా రేషన్ ఇవ్వడంతో పాటు ఏఏవై కార్డుదారులకు కేజీ పంచదార రూ. 13.50కు, మిగతా కార్డుదారులకు అర కేజీ పంచదార రూ. 17కు, కందిపప్పు కేజీ రూ. 67లకు, గోధుమ పిండి కిలో ప్యాకెట్ రూ. 16కు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

● జిల్లాకు 5251.345 మెట్రిక్ టన్నుల బియ్యం, 154.468 మెట్రిక్ టన్నుల పంచదార, 281.251 మెట్రిక్ టన్నుల కందిపప్పు, 281.251 మెట్రిక్ టన్నుల గోధుమ పిండి పంపిణీకి జిల్లా అధికారులు సిద్ధం చేశారు.

పంపిణీ ఇలా..

గత ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ అంటూ ఎండీయూ ఆపరేటర్లను నియమించింది. కానీ రేషన్ పంపిణీ చాలా చోట్ల అధ్వానంగా తయారైంది. ఎండీయూ ఆపరేటర్లు వీధుల్లో కొన్ని చోట్ల ఆపి ఆ ప్రాంతంలో ఉన్న కార్డుదారులందరికీ అక్కడకు పిలిపించి రేషన్ పంపిణీ చేసేవారు. దీనివల్ల వృద్ధులు, దివ్యాంగులు గంటల తరబడి నిరీక్షించి.. చాలా ఇబ్బందులు పడేవారు. కూలీలు అయితే ఆ రోజు ఉపాధి కోల్పోయేవారు. జిల్లాలో కొన్ని చోట్ల అసలు రేషన్ అందని పరిస్థితి ఉండేది. నెలలో ఏదో ఒకరోజు మాత్రమే రేషన్ ఇవ్వడంతో అనేకమందికి రేషన్‌కు దూరమయ్యేవారు. దీనిపై మండల, జిల్లాస్థాయి అధికారులకు కూడా ఫిర్యాదులు అందేవి. కానీ ఎటువంటి చర్యలు ఉండేవి కావు. దీంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంతోమంది కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ కష్టాలను గుర్తించిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ నెలలో ఎండీయూ ఆపరేటర్లు కచ్చితంగా రేషన్ డోర్ డెలివరీ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. అంతేకాదు 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పంపిణీ చేయాలని సూచించింది. ప్రతి ఒక్కరికీ రేషన్ ఇవ్వాలని ప్రభుత్వం సివిల్ సప్లయిస్ అధికారుల ద్వారా క్షేత్ర స్థాయిలో ఉన్న డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు దిశా నిర్దేశం చేసింది. సక్రమంగా నిత్యావసర సరుకుల పంపిణీ జరగకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది.



పకడ్బందీగా చర్యలు

జిల్లాలో రేషన్ పంపిణీ కొత్త విధానం అమలుకు పకడ్బందీగా చర్యలు తీసుకున్నాం. దీనిని ఎండీయూ ఆపరేటర్లు కచ్చితంగా పాటించాల్సిందే. ఎండీయూ ఆపరేటర్లకు పూర్తిస్థాయిలో సరు కులు అందించాల్సిన బాధ్యత రేషన్ డీలర్లపై ఉంది.

- శివప్రసాద్, డీఎస్‌వో, పార్వతీపురం మన్యం

ఆంధ్రజ్యోతి 4

నవ్య

కుటుంబ కదంబం

శ్రీకాకుళం ● సోమవారం ● 1 జూలై 2024

లిటిల్ మాస్టర్ డైవర్

నీరంటే పిచ్చి... స్కూబా డైవింగ్ అంటే ఆసక్తి. అవే కైనా ఖరేకి ప్రపంచంలోనే అత్యంత పిన్నవయస్కురాలైన మాస్టర్ స్కూబా డైవర్‌గా గుర్తింపు తెచ్చిపెట్టాయి. సాహసాలకు వయసుతో పని లేదంటున్న ఈ పన్నెండేళ్ల బెంగళూరు అమ్మాయి కథేమిటంటే...



"నీటి అడుగున నాకు ఎన్నో అనుభవాలు ఎదురయ్యాయి. చెప్పడానికి అనేక విశేషాలున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలీదు. వాతావరణం భయానకంగా ఉంటుంది, ఒక్కోసారి ఏదీ కనిపించదు. మనతో కలిసి డైవ్ చేసినవారు కనిపించకుండా పోవచ్చు. వాళ్ళకోసం వెతుకుతూ ఉండాలి. కొన్నిసార్లు చేపలు దాడి చేస్తాయి. "ఇంత రిస్క్ తీసుకొని, ఈ చిన్న వయసులో ఎందుకీ సాహసాలు?" అని ఎందరో అడుగుతూ ఉంటారు. "ఎందుకంటే... నీళ్ళంటే నాకు పిచ్చి. డైవింగ్ అంటే ఎనలేని ఆసక్తి. ఇక రిస్క్ అంటారా... రోడ్డు మీద నడిచి వెళ్తున్నప్పుడు కూడా ప్రమాదం జరగొచ్చు. అందరూ అన్ని వేళలా జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలి" అని చెబుతుంది కైనా ఖరే. ఇటీవలే అండమాన్-నికోబార్‌లో 'మాస్టర్ స్కూబా డైవర్ సర్టిఫికేషన్ అందుకొని, అధికారికంగా 'మాస్టర్ డైవర్'గా గుర్తింపు పొందిన ఈ పన్నెండేళ్ళ అమ్మాయి స్వస్థలం బెంగళూరు. రెండేళ్ళ వయసులోనే కైనాకు ఆమె తల్లితండ్రులు స్విమ్మింగ్‌ను పరిచయం చేశారు. "కైనాను అందరూ 'వాటర్ బేబీ' అని పిలిచేవారు. మా అపార్ట్‌మెంట్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో ఈతను ఆమెకు పరిచయం చేశాం. అందులో మంచి ప్రావీణ్యం సంపాదించింది. రెండేళ్ళ కిందట... తనకు పదేళ్ళ వయసులో... మా కుటుంబం అండమాన్-నికోబార్ దీవుల పర్యటనకు వెళ్ళినప్పుడు... స్కూబా డైవింగ్ పరిచయం అయింది. అప్పటి నుంచీ ఆమెకు అదే లోకంగా మారిపోయింది" అని చెప్పారు కైనా తల్లి అన్షుమ.



స్విమ్మింగ్ పూల్‌లో కాకుండా... సముద్రం జలాల్లో డైవ్ చెయ్యడం కాస్త భయంగానూ, సరదాగానూ అనిపించింది. స్కూబా డైవింగ్‌లో మరింత నైపుణ్యం కోసం ఇండోనేసియాలోని బాలిలో 'ఓపెన్ వాటర్ కోర్స్' చేశాను. అలాగే థాయిలాండ్‌లో 'అడ్వాన్స్‌డ్ ఓపెన్ వాటర్ కోర్స్ పూర్తి చేసి, సర్టిఫికెట్ అందుకున్నాను" అని చెబుతున్న కైనా అండర్‌వాటర్ ఫొటోగ్రఫీ, స్పెషలైజ్డ్ నిట్రోక్స్ డైవింగ్, రెస్క్యూ డైవర్ ట్రైనింగ్... ఇలా అనేక అంశాల్లో శిక్షణ పొందింది. "ఇవేవీ సాధారణమైన అంశాలు కావు. కేవలం రెండేళ్ళలోనే వాటన్నిటిలో కైనా నిష్ణాతురాలై... అనుభవజ్ఞులైన స్కూబా డైవర్లను ఆశ్చర్యపరచింది. స్కూబా డైవింగ్‌లో కోర్సులు చేస్తానని కైనా చెప్పినప్పుడు... మొదట్లో మేము సంకోచించాం. కానీ ఆమె పట్టుదలను చూసి... ప్రోత్సహించాం" అంటారు అన్షుమ.

సవాళ్ళకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి

స్కూబా డైవింగ్‌కు ఎంతో ధైర్యం, సమయస్ఫూర్తి కావాలి. భద్రతా ప్రోటోకాల్స్ కచ్చితంగా పాటించాలి. దానికి అనుగుణంగా కైమా తల్లితండ్రులు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటారు. "నేను అండమాన్-నికోబార్ దీవులతో పాటు బాలి, మాల్దీవులు, థాయిలాండ్... ఇలా ఎన్నో ప్రాంతాల్లో డైవింగ్ చేశాను. ప్రతి ప్రదేశానికీ తనదైన విశిష్టత ఉంది. నీటి అడుగున ఉండే పర్యావరణ వ్యవస్థలన్నా, జీవులన్నా నాకు చాలా ఇష్టం. అన్నిటిన్నా సముద్రపు తాబేళ్ళు నాకు ఫేవరెట్. అవి భారీగా, అద్భుతంగా ఉంటాయి" అని అంటోంది కైనా. స్కూబా డైవింగ్‌లో ఆమె ప్రతిభ... అధికారికంగా 'మాస్టర్ డైవర్ టైటిల్' అందుకొనేలా చేసింది. అసాధారణమైన పరిజ్ఞానం, అంకితభావం, నైపుణ్యం ఉన్నవారికి ఈ టైటిల్ ఇస్తారు. తద్వారా 'ప్రపంచంలో తక్కువ వయసున్న మహిళా మాస్టర్ స్కూబా డైవర్'గా గుర్తింపును సైతం కైనా సొంతం చేసుకుంది. "సముద్రంలో ఎలాంటి సవాల్‌నైనా ఎదుర్కోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. ప్రత్యేకించి అండమాన్-నికోబార్ దీవుల్లో వాతావరణం భయపెడుతుంది. వర్షాలు, తుపాన్లు హఠాత్తుగా ముంచుకొస్తాయి. అలాంటి వాతావరణంలో ఒకసారి ఒక డైవర్ నీళ్ళలోకి దూకి అపస్మారక స్థితికి చేరాడు. నేను అతన్ని బోట్ వరకూ ఈడ్చుకువచ్చాను. ఆ సంఘటన ఇప్పటికీ గుర్తొస్తూ ఉంటుంది" అంటున్న కైనా "మెరైన్ సైన్స్ చదవాలనేది నా కోరిక. ప్రపంచంలో వీలైన ప్రతిచోటా స్కూబా డైవింగ్ చెయ్యాలన్నది నా కల" అని చెబుతోంది.



సెలబ్ షెల్ఫ్



వరుస సినిమాలు లేవు. కానీ కెమెరా లెన్స్‌లు ఎప్పుడూ ఆమెపై ఎక్కుపెట్టే ఉంటాయి. టీవీ షోలకు గెస్ట్‌గా... హోస్ట్‌గా... అన్నిటికీ మించి ఫిట్‌నెస్ గురూగా... భిన్న పాత్రల్లో ఒదిగిపోయిన బాలీవుడ్ నటి శిల్పాశెట్టి. 'నా మది నియంత్రణలో నేను లేను. నా ఆధీనంలో నా మనస్సు ఉంటుంది. ఇదే నా ఆనందమయ జీవనానికి కారణం' అంటున్న శిల్ప... యాభై ఏళ్ల వయసులోనూ తరగని అందం... మైమరిపించే రూపంతో ఆకట్టుకుంటోంది.

శిల్ప సౌందర్యం

"ఎంత పని ఒత్తిడి ఉన్నా, ఎన్ని సమస్యలు చుట్టుముట్టినా, నన్ను మానసికంగా ఇంత దృఢంగా ఉంచుతున్నది భగవద్గీతలోని 'బంధురాత్మనస్తస్య యేనాత్మైవాత్మాన జితః... అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్' శ్లోకం. 'ఎవరైతే తమ మనస్సును జయిస్తారో అది వారికి మంచి మిత్రుడిగా ఉంటుంది. లేదంటే అదే వారికి శత్రువు అవుతుంది' అని దీని అర్థం. నా మనసు నా నియంత్రణలో ఉందని, దాని ఆధీనంలో నేను లేనని గుర్తు చేసుకోవడానికి రోజూ ఈ శ్లోకాన్ని బిగ్గరగా చదువుతా" అంటున్న శిల్ప క్రమం తప్పకుండా యోగా చేస్తుంది. క్లిష్టమైన యోగాసనాలతో కొన్ని వీడియోలు కూడా ఆమె విడుదల చేసింది. 'అలాగే శ్వాసకు, మానసిక ఆరోగ్యానికి సంబంధం ఉంది. ప్రతి భావోద్వేగం శ్వాసతో ముడిపడి ఉంటుంది. ఒకవేళ మీరు శ్వాస లయను మార్చగలిగితే భావోద్వేగాన్ని కూడా మార్చవచ్చు' అంటుందీ బ్యూటీ.

'యోగా ప్రకారం శ్వాసకు, మానసిక ఆరోగ్యానికి అనివార్యమైన సంబంధం ఉంది. ఎందుకంటే ఒక వ్యక్తి శ్వాస అతడి మానసిక స్థితిని ప్రతిబింబిస్తుంది. శ్వాస మీద నియంత్రణ గలవారు ప్రశాంత చిత్తంతో ఉండగలరు. ప్రాణాయామం లాంటి శ్వాస సంబంధిత ప్రక్రియలు ఒత్తిడిని తగ్గించి, భావోద్వేగాల సమతుల్యతకు దోహదపడతాయి. అదేవిధంగా పలు యోగాసనాల భంగిమలు కూడా శ్వాసతో ముడిపడినవే. గురువుల పర్యవేక్షణలో సాధన చేస్తే ఆనందమయమైన, ఆరోగ్యకరమైన జీవన శైలిని పొందగలుగుతారు'... అనేది శిల్ప మాట. యోగాను దైనందిన జీవితంలో భాగం చేయాలనుకొనేవారు... 'తొలుత సులువైన ఆసనాలతో ప్రారంభించి, క్రమంగా శరీరానికి అవసరమైనవాటిని సాధన చేస్తూ పోవాలి. వ్యాయామాలను ఏదో తప్పనిసరిగా చేస్తున్నట్టు కాకుండా... వాటిని ఆస్వాదిస్తే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయి. వీటన్నిటితో పాటు పరిశుభ్రమైన సమతుల ఆహారం, జీవన శైలి కూడా ఎంతో ముఖ్యం. అప్పుడే మన శరీరం సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకొంటుంది' అంటోందీ భామ.

వర్కవుట్ ఇలా...

ఇటీవల శిల్పాశెట్టి ఇన్‌స్టాలో ఫిట్‌నెస్‌కు సంబంధించి ఒక రీల్ పోస్టు చేసింది. అందులో సులువైనదీ, ఇంట్లోనే చేసుకోదగినవి, ప్రభావవంతమైనవి, అద్భుతమైన ఫలితాలను ఇచ్చే ప్లాంక్స్ చేసి చూపించింది. వాటిల్లో ఆర్మ్ ప్లాంక్, సైడ్ ఎల్బో ప్లాంక్, ఎల్బో ప్లాంక్ ఉన్నాయి. రోజుకు 15-20 చొప్పున మూడు సెట్లు చేస్తే చేతులు, భుజాలు, నడుము దగ్గర కండరాలు బలపడతాయని, ఇవి కేవలం ఇరవై నిమిషాల్లో ముగించగల వ్యాయామాలని చెప్పింది శిల్ప. అలాగే సేతు బంధాసన, విశుద్ధి చక్ర, అర్ధహలాసన, నవాసనాలను రోజువారీ యోగా సాధనలో చేర్చుకొంటే అద్భుత ఫలితాలు ఉంటాయంటోంది.

- శిల్పాశెట్టి వర్కవుట్స్ యోగా, కార్డియో, వెయిట్స్ కాంబినేషన్‌తో ఉంటాయి. శరీరాన్ని దృఢంగా, అపురూపంగా తీర్చిదిద్దుకోవడానికి ఆమె తన శరీరానికి సరిపడే కొన్ని వ్యాయామాలతో ఫిట్‌నెస్ మెనూ రూపొందించుకుంది.
- రోజూ ఉదయం ముప్ఫై నుంచి నలభై నిమిషాలపాటు యోగా
- తరువాత రన్నింగ్, జాగింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్‌తో కూడిన కార్డియో
- బిగువైన, బలమైన కండరాల కోసం వెయిట్‌లిఫ్టింగ్, స్క్వాట్స్, లంగెస్, పుషప్స్

ఇదీ మెనూ...

బిడ్డకు జన్మనిచ్చిన తరువాత కూడా శిల్పాశెట్టి శరీరాకృతిలో ఎలాంటి మార్పు రాలేదు. అందుకు ఆమె పాటించే వ్యాయామ, ఆహార నియమాలే ప్రధాన కారణం. మొదలుపెట్టి వదిలేసేవాళ్లే ఎక్కువగా కనిపిస్తుంటారు. అలాంటివారికి భిన్నం శిల్ప. క్రమశిక్షణకు ఆమె అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఆమె మెనూలో పోషకాలు నిండిన సమతుల ఆహారం ఉంటుంది. జీవక్రియ చురుగ్గా ఉండటానికి ఒకేసారి కాకుండా చిన్న చిన్న విరామాల్లో కొద్ది మొత్తంలో తీసుకొంటుంది. తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు మెనూలో ఉంటాయి. ప్రాసెస్‌డ్, జంక్ ఫుడ్, కూల్‌డ్రింక్స్, ఇతర డ్రింక్స్‌కు పూర్తిగా దూరం. శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవడానికి తరచూ మంచినీళ్లు తాగుతుంది.

- ఉదయం 15 ఎంఎల్ అలోవెరా జ్యూస్, పది తులసి ఆకులు, బెల్లం, అల్లం జ్యూస్. తరువాత రెండు గ్లాసుల గోరువెచ్చటి నీళ్లు.
- ఉదయం 8 గంటలకు బ్రేక్‌ఫాస్ట్‌లో మూడొంతుల నీళ్లు, ఒక వంతు పాలలో ఉడకబెట్టిన ఓట్స్/ మరగబెట్టిన పాలతో ముస్లీ/ వీట్ బ్రెడ్ టోస్ట్‌తో రెండు ఉడకబెట్టిన గుడ్లు, నానబెట్టిన బాదం.
- ఉదయం 9 గంటలకు బ్రౌన్ షుగర్‌తో టీ. గంట తరువాత బొప్పాయి, కర్బూజా, స్ట్రాబెర్రీ, నారింజ, ఐదు టేబుల్ స్పూన్ల యోగర్ట్ కలిపి ఒక బౌల్ నిండా ఫ్రూట్ సలాడ్.
- మధ్యాహ్నం ఒంటి గంటకు భోజనంలో చికెన్/ గ్రిల్‌డ్ ఫిష్, ఉడకబెట్టిన కాయగూరలు, నెయ్యితో బ్రౌన్ రైస్. లేదంటే ఉడకబెట్టిన బీన్స్, ఒక పచ్చి క్యారెట్, రోస్టెడ్ జీరాతో గ్లాసు ఉప్పు వేసిన మజ్జిగ.
- సాయంత్ర స్నాక్స్‌లో వెరైటీలు మారుతుంటాయి. పది రోస్టెడ్ మఖానా, ఐదు అక్రోట్స్, కిస్మిస్.
- రాత్రి ఏడున్నరకు మిక్స్‌డ్ వెజిటబుల్/ చికెన్ సూప్‌తో పాటు టమాటో, మొలకలు, యాపిల్, చాట్ మసాల కలిపిన పాలకూర.
- డిన్నర్‌లో గ్రిల్‌డ్, ఫ్రైడ్ చికెన్‌తో ఉడకబెట్టిన కూరగాయలు. లేదంటే బీన్స్/ బ్రకోలీతో ఉడకబెట్టిన ఫిష్, ఒక క్యారెట్.

కురుల ఆరోగ్యానికి.. అలోవెరా!

న్యూట్రిన్లు, విటమిన్లు, అమినో ఆమ్లాలుండే అలోవెరా చర్మానికే కాదు జుట్టు ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. ఇంట్లోని పెరటిలో ఉండాల్సిన మొక్క ఇది. ఇంతకీ అలోవెరాతో హెయిర్ ప్యాక్స్ చేసుకోవటమెలా?

- అలోవెరా జెల్‌ను తలకు పట్టించుకుంటే.. జుట్టు రాలటం ఆగిపోతుంది. ముఖ్యంగా తలలో దురదలు తగ్గిపోతాయి.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, రెండు టేబుల్ స్పూన్ల పెరుగు, రెండు టేబుల్ స్పూన్ల తేనె కలిపి చూర్ణంలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి ఆరిన తర్వాత మంచి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే చుండ్రు తగ్గిపోతుంది. మాడు చల్లగా, ఆరోగ్యంగా ఉంటుంది.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, రెండున్నర స్పూన్ల కొబ్బరినూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి అరగంట తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే.. హెయిర్ డ్యామేజ్ కావటం ఆగిపోతుంది.





- రెండున్నర టేబుల్ స్పూన్లు అలోవెరా జెల్‌కు.. రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం వేయాలి. మిశ్రమాన్ని బాగా కలిపి జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత శుభ్రంగా కడిగేయాలి. ఇలా పలుసార్లు చేస్తుంటే.. చుండ్రు పోతుంది. జుట్టు మిలమిలా మెరుస్తుంది.
- రెండు టేబుల్ స్పూన్ల మెంతుల్ని రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే మెత్తటి పేస్ట్‌లా చేసుకోవాలి. హెయిర్ ప్యాక్ కోసం బౌల్‌లో మూడు స్పూన్ల అలోవెరా జెల్ తీసుకుని.. ఇందులోకి మెంతుల పేస్ట్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి ఇరవై నిముషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తే జుట్టు పెరుగుతుంది.
- బౌల్‌లో అరకప్పు అలోవెరా జెల్ తీసుకుని.. ఇందులోకి రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్, ఒక కోడిగుడ్డు వేసి స్పూన్‌తో మెత్తటి పేస్ట్‌లో చేయాలి. దీన్ని జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. దీని వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.

నవ్య | చిత్రజ్యోతి

ఎవడికోసం తగ్గాలి



వైవిధ్యమైన చిత్రాలు, పాత్రలతో కథానాయకుడిగా ప్రేక్షకుల ముందుకొస్తున్నారు అల్లరి నరేశ్. ఆయన నటిస్తున్న 'బచ్చల మల్లి' చిత్రం గ్లింప్స్‌ను యూనిట్ ఆదివారం విడుదల చేసింది. ఈ వీడియోలో అల్లరి నరేశ్ పాత్రను మేకర్స్ పరిచయం చేశారు. 'ఏయ్ ఎవడికోసం తగ్గాలి, ఎందుకోసం తగ్గాలి' అంటూ ఆవేశంగా ఆయన పలికిన సంభాషణలు, పోరాట ఘట్టాల్లో ప్రదర్శించిన నటన ఆకట్టుకుంది. అమృత అయ్యర్ ఈ చిత్రంలో కథానాయిక. సుబ్బు మంగదేవి దర్శకత్వం వహిస్తున్నారు. రోహిణి, రావు రమేశ్, బలగం జయరాం, వైవా హర్ష కీలకపాత్రలు పోషిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు.

అల్లరి నరేశ్‌తో సితార చిత్రం

అల్లరి నరేశ్ హీరోగా ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం కొత్త సినిమాను ప్రకటించింది. 'మీరు అతని కంటి నుంచి తప్పించుకోలేరు' అంటూ పోస్టర్‌ను విడుదల చేసి, సినిమాపై ఆసక్తిని పెంచింది. 'ఫ్యామిలీ డ్రామా' చిత్రంతో ప్రశంసలు పొందిన మెహర్‌తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. 'ఏఎన్ 63' అనేది వర్కింగ్ టైటిల్. ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందనే నమ్మకాన్ని మేకర్స్ వ్యక్తం చేశారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని చిత్రబృందం తెలిపింది.

సాహసనారి పాత్రలో...



ఆది సాయికుమార్ నటిస్తున్న చిత్రం 'షణ్ముఖ'. ఈ డివోషనల్ థ్రిల్లర్‌కు షణ్ముగం సాప్పని దర్శకత్వం వహిస్తుండగా, తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేశ్ యాదవ్ నిర్మిస్తున్నారు. ఇందులో కథానాయికగా అవికాగోర్ నటిస్తున్నారు. ఆదివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా చిత్రంలో అవికా పోషించే పాత్ర లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు షణ్ముగం సాప్పని మాట్లాడుతూ "ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. ఇందులో అవికా సాహసోపేతమైన పనులు చేస్తూ, కథానాయకుడి లక్ష్య సాధనకు తోడ్పడే అమ్మాయి పాత్రను పోషిస్తున్నారు. చిత్రీకరణలో ఎక్కడా రాజీ పడకుండా అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందించాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తాం" అని చెప్పారు. 'ఇదొక విభిన్న తరహా చిత్రం, కథానాయిక పాత్రకు ప్రాధాన్యం ఉంది. ప్రేక్షకులను ఆకట్టుకునే కొత్త తరహా కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం' అని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.

నటి వరలక్ష్మీ శరత్‌కుమార్, వ్యాపారవేత్త నికోలయ్ సచ్‌దేవ్ పెళ్లి వేడుకలు మొదలయ్యాయి. రేపు ముంబైలో వీరి వివాహం జరగనుంది. ముందస్తు పెళ్లి వేడుకలకు సంబంధించిన ఫొటోలను వరలక్ష్మి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో అభిమానులతో షేర్ చేసుకున్నారు.



టీమ్ ఇండియా గెలుపుతో భావోద్వేగానికి లోనయ్యా



క్రికెట్‌లో టీమ్ ఇండియా ఆటను నిరంతం సపోర్ట్ చేసే సినీ తారల్లో బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ ఒకరు. శనివారం జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై టీమ్ ఇండియా గెలవడంతో ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. ఆ ఆనందాన్ని ఎక్స్‌లో షేర్ చేసుకున్నారు. "ఎన్నో ఏళ్ల తర్వాత ఓ ఐసీసీ ట్రోఫీని ఇండియా ముద్దాడడంతో నా కళ్ల వెంట ఆనందభాష్పాలు రాలుతున్నాయి. ఈ గెలుపు ఎప్పటికీ ప్రత్యేకమే. భారత్‌ను విశ్వవిజేతగా చూడటం మనందరికీ గర్వకారణం. భారత్ మాతా కీ జై..జై హింద్.." అని పేర్కొన్నారు. కాగా, తాను మ్యాచ్ చూస్తే ఇండియా ఓడిపోతుందని అమితాబచ్ నమ్ముతారు. అందుకే శనివారం జరిగిన ఫైనల్‌ను కూడా చూడలేదని ఆయన చెప్పారు.



మిస్టర్ ఎక్స్ ముగించాడు

ఆర్య, గౌతమ్ కార్తిక్ హీరోలుగా మను ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'మిస్టర్ ఎక్స్'. శరత్‌కుమార్, మంజు వారియర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్. లక్ష్మణ్‌కుమార్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. చివరి రోజు చిత్రీకరణకు సంబంధించిన స్టిల్స్‌ను ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. అజర్ బైజాన్, జార్జియా, ఉగాండా దేశాల్లో పోరాట ఘట్టాలను తెరకెక్కించామని మేకర్స్ తెలిపారు. ధిబు నినాన్ థామస్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: తన్వీర్ మీర్, ఎడిటింగ్: ప్రసన్న జీకే

కొత్త రోల్ కోసం రంగంలోకి



తనలోని నటికి సవాల్ విసిరే పాత్రల కోసం ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు అలియా భట్. గ్లామర్ తారగానే కాదు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతోనూ సత్తా చాటుతున్నారు ఆమె. తాజాగా యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో ఆమె 'రా' ఏజెంట్ పాత్రలో కనిపించనున్నారు. త్వరలోనే ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. దీంతో తన పాత్ర కోసం అలియా సన్నాహాలు మొదలు పెట్టారు. జిమ్‌లో భారీ వర్కౌట్ సెషన్స్‌లో పాల్గొంటున్నారు. ఆదివారం కూడా జిమ్‌లో శ్రమిస్తున్నారు. ఈ చిత్రానికి శార్వరీ వాఘ్ దర్శకుడు. అలియా నటించిన జిగ్రా చిత్రం అక్టోబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో 'లవ్ అండ్ వార్' చిత్రంలో నటిస్తున్నారు.

ఘనంగా 'ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్' ప్రదానోత్సవం



'కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్' ప్రదానోత్సవం ఇటీవలే హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. నందమూరి మోహన్ కృష్ణ, నటుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు మురళీమోహన్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. 'బేబీ' చిత్రానికి గాను ఉత్తమ కథానాయకుడిగా ఆనంద్ దేవరకొండ, దర్శకుడిగా సాయిరాజేశ్ పురస్కారాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మురళీ మోహన్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ పేరిట ఇచ్చే ఈ పురస్కారాలను అందుకున్నందుకు ఆనందంగా ఉంది. ఈసారి ఎన్టీఆర్ ఫిలిం లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు నాకు దక్కినందుకు ఆనందంగా ఉంది' అని చెప్పారు. మోహన్ కృష్ణ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ అనే మూడక్షరాలు సంచలనానికి మారుపేరు, ఆయన కొడుగ్గా పుట్టడం ఏదో జన్మలో చేసుకున్న పుణ్యంగా భావిస్తున్నాను. ఈ కార్యక్రమాన్ని ఇంత గొప్పగా నిర్వహిస్తున్న కళావేదిక సంస్థకు నా అభినందనలు' అన్నారు. తెలుగు జాతి కోసమే పుట్టి, తెలుగు జాతి ఆత్మగౌరవం కోసమే బతికిన వ్యక్తి తారక రామారావు గారు అని ముఖ్య అతిథిగా పాల్గొన్న నందమూరి మోహన రూప చెప్పారు.

పశువైద్యం అంతంతమాత్రమే

- మాటలకే పరిమితమైన గత ప్రభుత్వం
- వ్యాక్సిన్లు, మందులు కొరత
- పాడి రైతులకు తప్పని ఇబ్బందులు



రాజాం, జూన్ 30: ఐదేళ్లుగా జిల్లాలో పశు వైద్యం మొక్కుబడి చందంగా సాగింది. గాలి లెక్కలకే పరిమితమైంది. వసతులు మెరుగుపరచడం, మందులు అందుబాటులోకి తేవడం వంటివి మరిచిపోయింది. దీంతో పాడి రైతులు పడిన బాధలు అన్నీఇన్నీ కావు. ప్రస్తుతం సీజన్ మారింది. పశువులు వ్యాధుల బారిన పడుతున్నాయి. కానీ పశువుల ఆస్పత్రిలో సీజన్లలో వేయాల్సిన వ్యాక్సినేషన్లు లేవు. వైద్య శిబిరాల జాడలేదు.

ఉమ్మడి జిల్లాలో 58 గ్రామీణ పశువైద్యశాలలున్నాయి. దాదాపు అన్ని మండలాల్లో వీటిని ఏర్పాటుచేశారు. ఎక్కువగా పార్వతీపురం మండలంలో 4 పశువైద్యశాలలున్నాయి. జామి, మెంటాడ, బొండపల్లి, డెంకాడ, బొబ్బిలి మండలాల్లో మూడు ఆస్పత్రులు చొప్పున ఉన్నాయి. అయితే వైసీపీ ప్రభుత్వం ఆ మధ్య వీటిని తగ్గించే ప్రయత్నం చేసింది. మండలానికి ఒకటి, రెండు చొప్పున తగ్గించాలని చూసింది. వాస్తవానికి పాడి అభివృద్ధిపై దృష్టిపెట్టామని ప్రభుత్వం చెప్పుకొచ్చింది కానీ కీలకమైన పశువైద్యాన్ని మెరుగుపరచలేదు. వైద్యశాలలను తగ్గించాలని ప్రయత్నించడంతో అప్పట్లో విమర్శలు చెలరేగాయి. గంట్యాడ, గరివిడి, చీపురుపల్లి, నెల్లిమర్ల, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, మక్కువ, సీతానగరం, బలిజిపేటలో ఒక్కో పశువైద్య శాల ఉంది. మిగతా మండలాల్లో రెండేసి చొప్పున పశువైద్య శాలలు ఉన్నాయి. వాస్తవానికి ఈ పశువైద్యశాలల మధ్య దూరం చాలా ఎక్కువ. ఒక్కో ఆస్పత్రికి పదుల సంఖ్యలో గ్రామాల బాధ్యత ఉంటోంది. అక్కడ పనిచేసే వైద్యుడు, సిబ్బందిపై పనిభారం పడుతోంది. పశువులకు టీకాలు వేసే సమయంలో రైతులు సైతం వ్యయప్రయాసలకు గురవుతున్నారు. అత్యవసర సమయాల్లో గ్రామాల్లో ఉండే గోపాలమిత్రలు, ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు.

పశుసంవర్ధక శాఖ సహాయకులున్నా..

ప్రభుత్వం సచివాలయాల్లో పశుసంవర్ధక శాఖ సహాయకులను నియమించింది కానీ వీరు సమాచార సేకరణకు, ప్రభుత్వ పథకాల అమలుకు మాత్రమే పరిమితమవుతున్నారు. పశువుల అత్యవసర, అనారోగ్య సమయాల్లో వీరి సేవలు అక్కరకు రాకుండా పోతున్నాయి. కేవలం డిప్లమో



విద్యార్హతతో నియమితులైన వీరు అత్యవసర వైద్యసేవలు అందించలేకపోతున్నారు. దీంతో రైతులు తిరిగి పశువైద్యులనే ఆశ్రయిస్తున్నారు. గోపాలమిత్రలు కొందరు అందుబాటులో ఉండడంతో ఎలాగోలా నెట్టుకొస్తున్నారు. గతంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, పశుసంవర్ధక శాఖలు సంయుక్తంగా సీజన్ల వారీగా పశువైద్య శిబిరాలు నిర్వహించేవి. అవి కూడా తగ్గుముఖం పట్టాయి.

ప్రోత్సాహం అందిస్తామని చెప్పి..

పాడితోనే రైతు అభివృద్ధి అని చెబుతూ గత ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆవులను కొనుగోలు చేసి ఇవ్వనున్నట్టు ప్రకటించింది. రాయితీతో పశుదాణ అందించనున్నట్టు చెప్పింది. పశువైద్యాన్ని మరింత మెరుగ్గా అందించనున్నట్టు ఆర్భాటంగా ప్రకటించి ఇందుకుగాను నియోజకవర్గానికో అంబులెన్స్ ఇవ్వడంతో పాటు వైద్య పరీక్షల కోసం ల్యాబ్‌ను అందుబాటులో తేనున్నట్టు ప్రకటించింది. ఇవేవీ కార్యరూపం దాల్చలేదు.

ఇబ్బంది లేకుండా సేవలు

పశువైద్యం మరింత మెరుగుపరిచేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. పాడిరైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలందిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో మరింత మెరుగైన సేవలందిస్తాం.

-వైవీ రమణ, పశుసంవర్ధక శాఖ జేడీ, విజయనగరం

పశు సంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీగా వైవీ రమణ

విజయనగరం రూరల్: పశు సంవర్ధకశాఖ ఇన్‌చార్జి జేడీగా వైవీ రమణ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇంత వరకూ జేడీగా ఉన్న విశ్వేశ్వరరావు ఆదివారం పదవీ విరమణ పొందారు. ఆ వెంటనే ఇన్‌చార్జి జేడీగా వైవీ రమణ విశ్వేశ్వరరావు నుంచి చార్జి తీసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో పశు సంవర్ధకశాఖ తరఫున అన్ని మందులు సిద్ధం చేశామని, వాక్సినేషన్ తదితర కార్యక్రమాలన్నీ సకాలంలో వేసేందుకు తగిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.

రేపు జాబ్‌మేళా

రాజాం: రాజాం ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం ఐటీఐ సెక్టార్, నాన్ ఐటీఐ సెక్టార్‌లో ఉద్యోగంకోసం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 28 సంవత్సరాల్లోపు వయస్సుగల వారు, ఐటీఐ కోపా ట్రేడ్‌లో ఉత్తీర్ణత చెందిన వారు, ఇంటర్, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన స్త్రీలు, పురుషులకు మౌఖిక పరీక్షలు నిర్వహించి ప్రారంభంలో 90 రోజులు ఉచితంగా శిక్షణ ఇచ్చి టెక్ సపోర్ట్, బీపీఎస్ అండ్ బీపీవోలుగా ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు. వివరాల కోసం 81214 50657, 9573574643 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని తెలిపారు.

రాజాంలో రారవే సమావేశం

రాజాం: రాజాంలో రాజాం రచయితల వేదిక (రారవే) 113వ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త నేతేటి గణేశ్వరరావు శ్రీనాథుని కవిత్వ విహంగ వీక్షణం అన్న అంశంపై ప్రసంగం చేశారు. అల్లి మోహనరావు అధ్యక్షతన జరిగిన సభలో వేదిక నిర్వాహకుడు గారరంగనాథం, శాసపు సత్యనారాయణ,పొట్నూరుకోటిబాబు, గారసీతారత్నం పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణ తరగతులు

రాజాం: వికాస తరంగిణి రాజాం శాఖ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు మంగళవారం నుంచి ఈనెల 11 వరకు నిర్వహించనున్నట్లు యోగా గురువు టీటీవీ రమణమూర్తి ఒకప్రకటనలో తెలిపారు. మొదటి బ్యాచ్ ఉదయం ఐదు నుంచి 6.30 గంటల వరకు విద్యానికేతన్ పాఠశాలలో జరుగుతాయని, వీటికి స్త్రీ పురుషులంతా పాల్గొనవచ్చన్నారు. స్త్రీల కోసం ప్రత్యేకంగా సాయంత్రం ఐదు నుంచి 6.30 గంటల వరకు వికాస తరంగిణి కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

గ్రామ సభలకు హాజరుకావాలి

శృంగవరపుకోట: ఓటుహక్కు కలిగిన వారంతా గ్రామసభలకు హాజరుకావాలని ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు డి.సూర్యారావు ఒక ప్రకటనలో కోరారు. సోమవారం నుంచి జరగనున్న గ్రామసభల్లో పంచాయతీ అభివృద్ధికి అవసరమగు సలహాలు ఇవ్వాలన్నారు. డీఎల్‌పీఓలు, ఈవోపీఆర్డీలు, కార్యదర్శులు గ్రామసభలను చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు.

ఘనంగా పశువులమ్మతల్లి పండగ

వేపాడ: మండలంలోని చామలాపల్లి గ్రామంలో గ్రామదేవత పశువులమ్మతల్లి అమ్మవారి పండగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ కోలా సతీష్, మాజీ సర్పంచ్‌లు అడపా అప్పలసూర్యనారాయణ, కుంచి కోటేశ్వరరావు, గ్రామ పెద్దలు సారథ్యంలో గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో అధిక సంఖ్యలో పాల్గొని డప్పు, కాంగో వాయిద్యాలతో అమ్మవారిని, పూజారితో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చినగుడిపాల గ్రామంలో గ్రామస్థులు గ్రామ సర్పంచ్ భోజంకి రామునాయుడు సారథ్యంలో గ్రామ దేవత పశువులమ్మ పండగను వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

4న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్

బొబ్బిలి: ఐక్యవిద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జూలై 4న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏఐఎస్ఎఫ్ నేత బి.రవికుమార్ తెలిపారు. ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాడు. టీఐఎస్ఎస్ ముంబయి, ఐఐటీ ముంబయ్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీల్లో విద్యార్థి సంఘాల నాయకులపై అక్రమ కేసులు, నిర్బంధాలు, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛలను అణిచివేత విధానాలను అరికట్టాలన్న డిమాండ్లతో దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌లు పిలుపునిచ్చినట్లు ఆయన తెలిపారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, పీడీఎస్ఏ, ఏఐఎస్ఏ, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌వో సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

దేవుడి భూముల్ని కాపాడాలి

తెర్లాం, జూన్ 30: మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్న దేవుడి మాణ్యం భూములు పక్కదారి పట్టకుండా సర్వే జరపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో దేవుడి భూములు ఉన్నాయని, వాటిని పెత్తందారుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని ఆయన గుర్తు చేశారు. దేవదాయశాఖ పరిధిలో ఉన్న భూముల్ని ఆదివారం ఆయన పరిశీలించారు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు దేవదాయశాఖ భూములతో పాటు ఇనాం భూములు, డి.పట్టా భూమిని తప్పుడు సర్వే నెంబర్లతో అమ్మకాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

- మండల పరిషత్ అధికారులకు ఎమ్మెల్యే అదితి ఆదేశం

విజయనగరం రూరల్, జూన్ 30: విద్య, వైద్యానికి సంబంధించి మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, వీటికి సంబంధించి ఏమైనా ప్రతిపాదనలు ఉంటే వెంటనే సిద్ధం చేయాలని మండల అధికారులకు విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆదేశించారు. ఆదివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగింది. ఎంపీడీవో గంటా వెంకటరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికి పుష్పగుచ్చాలు ఇచ్చారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో విద్య, వైద్యం, ఇంజినీరింగు, పౌరసరఫరాలు, గృహనిర్మాణం తదితర శాఖలపై సమీక్షించారు. రాకోడు సర్పంచ్ వేచలపు శ్రీను మాట్లాడుతూ రాకోడు గ్రామంలో ఉన్న స్కూల్లో ముగ్గురు ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందారని, వారి స్థానంలో కొత్తవారిని నియమించకపోతే, అక్కడ విద్యా ప్రమాణాలు తగ్గుతాయన్నారు. అదే విధంగా నారాయణపురం సర్పంచ్, ఎంపీటీసీ మాట్లాడుతూ, నారాయణపురంలో 9, 10 తరగతులకు సంబంధించి విద్యను అందించాలని, ఇక్కడ ఆ తరగతులు అందుబాటులో లేకపోవడం వల్ల విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని సూచించారు. ఈ విషయమై ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ, విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వైద్యానికి సంబంధించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. మండల పరిధిలోని పీహెచ్‌సీలో కార్యక్రమాలు నిర్వహించాలని, వైద్యం అందరికీ అందాలన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ముందుకు వెళ్లాలన్నారు. ప్రాధాన్య క్రమంలో సమస్యలను పరిష్కరించాలని ఆమె అధికారులకు సూచించారు.



సమావేశంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

ఆ ఆక్రమణలు తాత్కాలికమేనట!

- నోటీసులిచ్చాం.. తదుపరి చర్యలు తీసుకుంటాం
- కలెక్టర్‌కు వివరణ ఇచ్చిన రాజాం మున్సిపల్ కమిషనర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజాం రూరల్, జూన్ 30: 'ఆ ఆక్రమణలు తాత్కాలికమే.. గత 20 ఏళ్లుగా మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నారు.. కొన్నింటికి నోటీసులిచ్చి తదుపరి చర్యలు తీసుకుంటాం..' ఇదీ రాజాం మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు కలెక్టర్ అంబేడ్కర్‌కు ఇచ్చిన వివరణ. ఈనెల 29న 'స్థలం కొట్టు.. బడ్డీ పెట్టు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ అంబేడ్కర్ సీరియస్ అయ్యారు. రాజాం మున్సిపల్ కమిషనర్‌కు వివరణ కోరారు. దీంతో స్పందించిన కమిషనర్ రామ అప్పలనాయుడు వాస్తవాలు పరిశీలించాల్సిందిగా టౌన్ ప్లానింగ్ అధికారికి సూచించారు. దీంతో రంగంలోకి దిగిన టౌన్ ప్లానింగ్ అధికారి ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ప్రతి ఆక్రమణనూ పరిశీలించారు. నివేదికను కమిషనర్‌కు అందజేశారు. ఆ నివేదికను కలెక్టర్‌కు కమిషనర్ సమర్పించారు. ఆ నివేదికలో ఆక్రమణలు తొలగిస్తామన్న మాట ఎక్కడా ప్రస్తావించలేదు. అవన్నీ తాత్కాలిక ఆక్రమణలేనని చెప్పుకొచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఆక్రమణలు శాశ్వతమైనా, తాత్కాలికమైనా తొలగించాల్సిన బాధ్యత కలిగిన కమిషనర్ అందుకు విరుద్ధంగా కలెక్టర్‌కు నివేదించారు. దాదాపుగా ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం వాస్తవమేనని కమిషనర్ పరోక్షంగా అంగీకరించారు. ఆయన కలెక్టర్‌కు పంపించిన నివేదికలోని అంశాలను పరిశీలిస్తే..

- రాజాం-డోలపేట మధ్య సాగునీటి కాల్వను ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీని తొలగించాల్సిందిగా నోటీసులిచ్చాం, ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక బడ్డీల యజమానులకు తొలగించాలని నోటీసులిచ్చి, తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌కు వివరణ ఇచ్చారు. ● మున్సిపాలిటీకి చెందిన పాత బస్టాండ్ స్థలంతో పాటు పశు సంవర్థకశాఖ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణ, ఆర్.అండ్‌బి కార్యాలయ ఆవరణలోని ఆక్రమణలు శాస్వత నిర్మాణాలు కావని, తాత్కాలికమేనని కలెక్టర్‌కు కమిషనర్ వివరించారు. ● రాజాం మెయిన్‌రోడ్‌ను 80 అడుగుల మేర విస్తరించారు. ఈ సమయంలో సెంటర్ డివైడర్‌తో పాటు ఇరువైపులా కాల్వల నిర్మాణం చేశారు. వాటిపై సిమెంట్ పలకలు వేశారు. ఇందుకోసం లక్షలాది రూపాయులు వెచ్చించారు. అయితే మెయిన్‌రోడ్‌కు ఇరువైపులా ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు వెలిసాయి. ఇదే విషయాన్ని కమిషనర్ రామ అప్పలనాయుడు సైతం కలెక్టర్‌కు పంపిన నివేదికలో స్పష్టం చేశారు.

పార్వతీపురంలో వైశ్యరాజు జ్యూయలర్స్

- ప్రారంభించిన పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, జూన్ 30: పార్వతీపురం మెయిన్ రోడ్డులో పద్మశ్రీ థియేటర్ ఎదురుగా వైశ్యరాజు జుయలర్స్ షోరూమ్‌ను పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర రిబ్బను కత్తిరించి ఆదివారం ప్రారంభించారు. మొదట జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గొట్టాపు గౌరీశ్వరి పాల్గొన్నారు. విశాఖ పట్టణానికి చెందిన జామి నగేష్ మొదటి కొనుగోలు చేశారు. వైశ్యరాజు జ్యూయలర్స్ ఎమ్‌డీ వైశ్యరాజు భద్రగిరిరాజు మాట్లాడుతూ పార్వతీపురం, రాయగడ జిల్లా కష్టమర్లకు మరింత చేరువగా షోరూమ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అన్ని రకాలా బంగారు, వెండి ఆభరణాలు ఎక్స్ఛేంజ్‌పై 6శాతం తరుగుకే బంగారం, వెండి ఆభరణాలు అందిస్తామన్నారు. జీఎస్టీ కూడా మినహాయింపు ఇచ్చి ఖాతాదారులకు సరసమైన ధరలకే ఆభరణాలు అందిస్తామని వెల్లడించారు. కేజీ వెండి కొనుగోలు చేసినట్లయితే రూ.10వేలు తగ్గింపు అందిస్తామన్నారు. ప్రతి కొనుగోలుదారులు షోరూమ్‌కు వచ్చి తాము కల్పించిన ఆఫర్లను అందుకోవాలని కోరారు. వైశ్యరాజు ఫల్గుణరాజు, వైశ్యరాజు నరేష్‌రాజు, వైశ్యరాజు కిరణ్‌కుమార్‌రాజు, బెలగాం జయప్రకాష్ నారాయణ, టీడీపీ సీనియర్ నాయకులు బార్నాల సీతారాం, వెంకటేశ్వర జ్యూయలర్స్ యజమాని ఇందుపూరు గోపాలరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ గుణేశ్వర రావు, స్థానిక వ్యాపారవేత్తలు గుంపస్వామి, వెంకటరమణమూర్తి, జె.రామకృష్ణ తదితరులున్నారు.



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

గత ప్రభుత్వ నిర్ణయాలను సరిచేయాలి

బొబ్బిలి, జూన్ 30: గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా ప్రాథమిక విద్యారంగం పూర్తి సంక్షోభంలో ఉందని, విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, తక్షణం లోపాలను సరిచేయాలని కోరుతూ కేంద్ర విమానయానశాఖామాత్యులు కింజరాపు రామ్మోహననాయుడుకు వినతిపత్రం సమర్పించినట్లు ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతి తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కేంద్ర మంత్రిని కలిసి విద్యారంగ సమస్యలను నివేదించినట్లు ఆయన తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చినట్లు గణపతి తెలిపారు. విశాఖ-రాయపూర్ రైలును రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని, విశాఖ నుంచి రాయగడ వరకు శాటిలైట్ రైలును వేయాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు. ఆప్టా నాయకులు చింటాడ రాము, సత్యారావు, ఎ.రామారావు, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారని గణపతి వివరించారు.



కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సామూహిక విత్తనశుద్ధి కార్యక్రమం

బొబ్బిలి, జూన్ 30: మండలంలోని మెట్టవలస, గొర్లె సీతారాంపురం గ్రామాల్లో సూడోమోనాస్ బీజామృతంతో సామూహికంగా విత్తనశుద్ధి కార్యక్రమం నిర్వహించారు. వీఏఏ రాజశేఖర్, ఎస్‌డీఏ వాండ్రాసి లక్ష్మి, ఐసీఆర్ పీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో ఆదివారం రైతులతో విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తూ వారందరిచేత శాస్త్రీయంగా ఈ ప్రక్రియను నిర్వహించారు. ● జగన్నాథపురంలో ప్రకృతి వ్యవసాయప్రతినిధి ఉరిటి శంకరరావు, వీఏఏ సుష్మిత ఆధ్వర్యంలో సామూహిక విత్తనశుద్ధి ప్రక్రియను రైతులు నిర్వహించారు. ఇలా చేయడంతో విత్తనాల నుంచి గాని, భూమి నుంచి గాని వచ్చే తెగుళ్లను విజయవంతంగా నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ శ్రీరాములు, సునీత, రైతులు పాల్గొన్నారు.

అమరావతి, పోలవరం నిర్మాణానికి తొలి జీతం

- ప్రకటించిన ఎంపీ కలిశెట్టి

విజయనగరం (ఆంధ్రజ్యోతి), జూన్ 30: ఎంపీగా తొలి నెల జీతంతో పాటు అలెవెన్సులన్నింటినీ రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అందజేస్తానని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. తిరుమల తిరుపతి వేంకటేశుని ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఆయన ఈ మేరకు ప్రకటించారు. అమరావతి, పోలవరం నిర్మాణంలో సీఎం చంద్రబాబు నాయుడికి అండగా వుండేందుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లో వుంటున్న ఎన్ఆర్ఐలు సైతం తమ వంతుగా విరాళాలు ఇచ్చి మద్దతుగా నిలవాలన్నారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఉన్నత స్థాయిలో నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేంకటేశ్వర స్వామి దీవెనలు అందాలని ఆకాంక్షించారు. ఒక ఆంధ్రుడిగా బాధ్యతతో రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి కోసం తన వంతుగా తొలి జీతం, అలెవెన్సులు అందజేసేందుకు నిర్ణయించుకున్నానన్నారు.



తిరుమల కొండపై కుటుంబ సభ్యులతో కలిశెట్టి


ఎన్నికల అనంతరం ప్రజలపై భారం తగదు

బొబ్బిలి: ఎన్నికల ప్రక్రియ ముగియడంతో కేంద్రప్రభుత్వం యథాతథంగా ప్రజలపై పలు రూపాల్లో భారాలు మోపేందుకు పూనుకోవడం దుర్మార్గమైన చర్య అని సీపీఎం నాయకుడు పి.శంకరరావు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎంతో ప్రజాదరణ కలిగిన బీఎస్ఎన్ఎల్ ప్రభుత్వ రంగ సంస్థను సర్వనాశనం చేసి, జియో సంస్థకు లాభదాయకమైన విధానాలను అమలు చేయడం సిగ్గుచేటన్నారు. దేశ ప్రజలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా పన్నుల భారాన్ని మోపేందుకు వెనుకాడడం లేదన్నారు. ఎన్‌డీఏ భాగస్వాములుగా ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలు స్పందించి ప్రజల తరఫున తమ గళం వినిపించాలన్నారు.

జిందాల్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి శ్రీనివాస్‌కు విన్నవించిన తాజా మాజీ ఎమ్మెల్సీ రఘురాజు

గంట్యాడ/ఎస్.కోట: ఎస్.కోట మండల పరిధిలో జిందాల్ పరిశ్రమ కోసం భూములు ఇచ్చిన నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని తాజా మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన గంట్యాడలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. గత 15 సంవత్సరాల కిందట ఎస్.కోట మండలంలోని వివిధ గ్రామాల్లో జిందాల్ పరిశ్రమలు ఏర్పాటు చేయడం కోసం రైతుల నుంచి భూములు సేకరించారని, అయితే ఆయా భూముల్లో ఇప్పుడు జిందాల్ పరిశ్రమ కాకుండా ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలుస్తోందని, ఈ పరిస్థితిలో భూములు ఇచ్చిన రైతుల సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వివరించారు. అప్పట్లో భూములు ఇచ్చిన రైతులకు ఇంకా పరిహారం చెల్లించాల్సి ఉందని, అలాగే ఉద్యోగాలు కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారని ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనికి ముందు బాధ్యతలు స్వీకరించిన మంత్రికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు.



మంత్రి శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించిన రఘురాజు

పునర్జన్మనిచ్చేది వైద్యులే

విజయనగరం దాసన్నపేట: సమాజంలో వైద్యుడు ఆరోగ్య రక్షకుడుగా నిలుస్తున్నాడని, పునర్జన్మనిచ్చేది కూడా వైద్యులేనని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జేసీ నాయుడు అన్నారు. ఆదివారం గ్రంథాలయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కంటోన్మెంట్‌లోని గురజాడ విద్యాసంస్థల్లో జాతీయ వైద్యుల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ నాయుడు మాట్లాడుతూ వైద్యులను భగవంతునితో సమానంగా గౌరవిస్తారని, తల్లిదండ్రులు జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మనిస్తారన్నారు. యురాలజిస్టు డాక్టరు శ్రీకాంత్, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టరు భూపతి మాట్లాడుతూ, మందులు రోగాలను నయం చేస్తాయికాని, వైద్యులు మాత్రమే రోగులను నయం చేయగలరన్నారు. ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ సన్యాసమ్మ మాట్లాడుతూ, ప్రాణాలు సైతం పణంగా పెట్టి కరోనా సమయంలో వైద్యులు అందించిన సేవలు గొప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సముద్రాల గురుప్రసాద్, సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.



వైద్యులను సత్కరించిన గురుప్రసాద్

వివాహిత ఆత్మహత్య

పార్వతీపురంటౌన్, జూన్ 30: వివాహిత ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పట్టణ సీఐ కృష్ణారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పార్వతీనగర్‌కు చెందిన జి.భార్గవి(27)కి బైపాస్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వి. నరేష్‌బాబుతో ఏడాది క్రితం వివాహమైంది. కొన్నాళ్లు బాగానే ఉన్నా అనంతరం భార్యభర్తల మధ్య చిన్న చిన్న వివాదాలు పెద్దవిగా మారాయి. అత్తవారింట భర్త, అత్తమామల వేధింపులు పెరిగాయి. భర్తకు దూరం అవుతున్నాననే బాధతో భార్గవి మనస్తాపానికి గురైంది. దీంతో ఇంట్లోని బాత్‌రూమ్‌లో చున్నితో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీనిపై తండ్రి మధుసూదనరావు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



భార్గవి (ఫైల్)

స్నానానికి దిగి వృద్ధుడి మృతి

కొమరాడ, జూన్ 30: జంఝావతి రబ్బర్ డ్యాం దిగువన స్నానానికి దిగిన వ్యక్తి మృతి చెందాడు. ఇందుకు సంబంధించి కొమరాడ ఎస్ఐ నీలకంఠం అందించిన వివరాలిలా ఉన్నాయి. బొండపల్లి మండలం గరుడబిల్లి గ్రామానికి చెందిన కలియ దాసు(60) బూర్జివలస స్టోన్ క్రషర్‌లో పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం కూడా పనికి వెళ్లి, పనులు ముగిసిన తర్వాత సాయంత్రం స్నానానికి నదికి వెళ్లాడు. నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో దాసు మునిగిపోయాడు. ఆదివారం ఉదయం గుర్తించి మృతదేహాన్ని వెతికి బయటకు తీసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రాష్ట్రాన్ని కాపాడుకోవడమే కూటమి లక్ష్యం

కొత్తవలస, జూన్ 30: రాష్ట్రాన్ని కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరూ ఎన్డీఏ కూటమి విజయానికి పని చేశారని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. ఆదివారం కొత్తవలస పంచాయతీ, చింతలదిమ్మ గ్రామస్థులు ఏర్పాటు చేసిన విజయోత్సవ ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును ఆశీర్వదించారన్నారు. తనపై పూర్తి నమ్మకం ఉంచి తనకు భారీ మెజార్టీని ఇచ్చి గెలిపించారన్నారు. చింతలదిమ్మ గ్రామానికి వచ్చిన లలిత కుమారికి గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు.



మాట్లాడుతున్న లలితకుమారి

నేడు పింఛన్ల పంపిణీ ప్రారంభం

రాజాం: ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభిస్తున్నట్లు పురపాలక సంఘం కమిషనర్ జె.రామప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిదో వార్డు మేదరవీధి, 21వ వార్డు చాకలవీధి, గొల్లవీధి, ఎస్సీకాలనీ, 23వ వార్డు డోలపేటలో ఉదయం ఐదు గంటలకు ఎమ్మెల్యే ప్రారంభించి ముఖ్యమంత్రి సందేశ పత్రాలను పింఛన్ పంపిణీతో పాటు అందజేస్తారని పేర్కొన్నారు. రూరల్ పరిధిలో కూడా కోండ్రు చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ ప్రారంభిస్తామని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు. ● **విజయనగరం రూరల్:** ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో విజయనగరం నియోజకవర్గ ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సోమవారం నగరంలోని పలు డివిజన్లు, మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఈ కార్యక్రమంలో పాల్గొంటారని టీడీపీ నియోజకవర్గ కార్యాలయ ప్రతినిధి గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభంకానుందన్నారు. ● **బాడంగి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల పెంపును అమలు చేస్తున్నారని టీడీపీ ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 7 వేల రూపాయలు పింఛన్‌ను జూలై 1న ఆరు గంటలకు ఇంటింటికీ వెళ్లి అందజేయనున్నారన్నారు. దీంతో దూర ప్రాంతాలలో ఉన్నవారంతా పెన్షన్ తీసుకునేందుకు సొంత గ్రామాలకు ఒకరోజు ముందుగానే వచ్చి ఉన్నారన్నారు. అనంతరం ఆయన బాడంగి అగ్నిమాపక కేంద్రంలో విధులు నిర్వహించి పదవీవిరమణ పొందుతున్న ఎస్ఐ రామినాయుడు దంపతులను ఘనంగా సత్కరించారు. ● **తెర్లాం:** బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన చేతులమీదుగా కోడూరు, బాడంగి గ్రామాల్లో సామాజిక పింఛను పంపిణీ చేయనున్నట్టు జిల్లా బీసీ సాధికారిత కొప్పలవెలమ కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు తెలిపారు. తొలుత కోడూరు గ్రామంలో పింఛన్ల పంపిణీ ఉంటుందని, అనంతరం బాడంగిలో కూడా కార్యక్రమం ఉంటుందని పార్టీ ప్రెసిడెంట్ తెంటు రవిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెంటు లక్ష్మునాయుడు కూడా పాల్గొంటారని తెలిపారు. వీరితోపాటు రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం కన్వీనర్ అడ్డా గోవిందా, మరిపి రమేష్, టీడీపీ పార్టీ మండల కార్యదర్శి లచ్చుపతుల సత్యం తదితరులు పాల్గొంటారన్నారు. ● **బొబ్బిలి:** రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం వేకువజామునుంచి జరగనున్న సామాజిక పెన్షన్ల పంపిణీలో పార్టీల శ్రేణులంతా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్ పథకంలో ఇచ్చిన హామీ మేరకు నెలకు నాలుగువేలరూపాయలకు పెన్షన్‌ను పెంచారని, దీనికి అదనంగా మూడు నెలల బకాయిలను కలిపి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

రక్షణ గోడ నిర్మించండి

ప్రమాదం

వీరఘట్టం: వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న కోడి రామ్మూర్తి నాయుడు రంగస్థల కళాకారుల సంఘం వెనుక వైపు వర్షపు నీటితో కోతకు గురవుతోంది. దీంతో ప్రమాదం పొంచి ఉంది. గ్రామం నుంచి వస్తున్న వర్షపు నీరు ఈ భవనం పక్క నుంచి చెరువులోకి వెళ్తోంది. దీంతో భవనం వెనుక భాగంలో ఉన్న మట్టికోతకు గురవుతోంది. వీరఘట్టం, పాలకొండ, గరుగుబిల్లి, వంగర మండలాల నుంచి సుమారు వందమంది వరకు కళాకారులు ఇక్కడకు వస్తుంటారు. ప్రభుత్వ అధికారులు స్పందించి కళాకారుల భవనానికి రక్షణ గోడ మంజూరు చేయాలని సంఘ సభ్యులు కోరుతున్నారు.


భవనం వెనుక వైపు కోతకు గురవుతున్న దృశ్యం

అధ్వానం


చిట్టిపుడివలస వద్ద గోతులమయంగా మారిన రహదారి

అడుగడుగునా గోతులమయం

● ఇదీ పార్వతీపురం-పాలకొండ ప్రధాన రహదారిలో దుస్థితి

వీరఘట్టం: పార్వతీపురం-పాలకొండ ప్రధాన రహదారిలో చిట్టిపూడివలస, నడిమికెల్ల వద్ద రహదారి అధ్వానంగా మారింది. అడుగడుగనా గోతులయంకావడంతో వాహన చోదకులు అగచాట్లకు గురవుతున్నారు. ఇటీవల భారీ వాహనాలు ఈ రహదారిలో రాకపోకల వల్ల మరింత దారుణంగా తయారైంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వ హ యాంలోనైనా రహదారికి మరమ్మతులు చేపట్టి.. ప్రమాదాలు నివారించాలని పలువురు కోరుతున్నారు.

తోటల్లో లైన్లు..

సరఫరాకు అంతరాయం

అంధకారం

● తోణాం కొత్తూరు, బొర్రమామిడి గిరిజనుల అవస్థలు

సాలూరు రూరల్: ఏ మాత్రం గాలి వీచినా తమ గ్రామాలు అంధ కారంలో ఉండాల్సి వస్తోందని... విద్యుత్ లైన్లు మార్చి, సమస్యను పరిష్క రించాలని తోణాం కొత్తూరు, బొర్రమా మిడి గిరిజనులు మొర పెట్టుకుంటు న్నారు. తోణాం కొత్తూరు, బొర్రమా మిడికి విద్యుత్ సరఫరా చేసే స్తంభాలు, లైన్లు పామాయిల్ తోటల మధ్య నుంచి ఉన్నాయి. ఏటా వర్షాకాలంలో ఆ గ్రామా ల గిరిజనులు విద్యుత్ సరఫరాలో అంతరాయంతో రోజుల తరబడి చీకటిలో ఉండాల్సి వస్తోంది. గాలులు వీచినప్పుడు పామాయిల్ మట్టలు, కొమ్మలు తీగెలపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని తోణాం కొత్తూరుకు చెందిన తవుడు మంగళవారం విలేకరులకు తెలిపాడు. తమ సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరాడు.


తోటల మధ్య నుంచి వెళ్తున్న విద్యుత్ లైన్

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమం

సీతంపేట: ఐటీడీఏ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీవో వెంకట గణేష్ తెలిపారు. అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు పింఛన్ల పంపిణీ

మక్కువ: మండలంలోని కవిరిపల్లిలో ఎన్టీఆర్ భరోసా కార్యక్రమంలో భాగం గా ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసే కార్యక్రమంలో సోమవారం మహిళ, శిశు, గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొనున్నారు. మండలం లోని 8,520 పింఛన్‌దారులకు సచివాలయ సిబ్బంది నేరుగా ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీచేస్తారని, ఎవరూ సంబంధిత సచివాలయాలకు రావద్దని లబ్ధిదారులు ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని ఎంపీడీవో పి.దేవకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ● **సాలూరు:** పట్టణంలో ఎన్టీఆర్ భరోసా చంద్రన్న పింఛన్ల పండగ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఇంటింటికి వెళ్లి పంపిణీ కార్యక్రమం చేయనున్నారు. పట్టణంలో ఉదయం 9 గంటలకు 21వ వార్డు గొల్లవీధిలో, 10 గంటల 30 నిమిషాలకు సాలూరు మండలం కందులపథంలో, మధ్యాహ్నం మక్కువ మండలం కవిరిపల్లి సచివాలయం, మధ్యాహ్నం మూడు గం టలకు మంచాడవలస, సాయంత్రం 4:30కు మెంటాడ మండలం గుర్ల తమ్మి రాజు పేటల్లో నిర్వహించనున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె హాజరుకానున్నారు. ● **సీతంపేట:**మండలంలోని వలగెడ్డలో సోమవారం ఎమ్మెల్యే జయకృష్ణ పింఛన్లు పంపిణీ చేపడతారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ● **వీరఘట్టం:** వీరఘట్టంలో సోమవారం ఎమ్మెల్యే జయకృష్ణ పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు టీడీపీ పట్టణాధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. ● **పాలకొండ:** పట్టణంలోని గారమ్మ కాలనీ, పనుకువలస, నవగాం ల్లో సోమవారం ఎమ్మెల్యే జయకృష పింఛన్లను పంపిణీచేయనున్నారు. ● **గుమ్మలక్ష్మీపురం:** పెన్షన్ల పంపిణీలో టీడీపీ నాయకులు పాల్గొనాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదివారం ఒక ప్రకటన లో కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


భామినిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

భామిని: భామిని జిల్లా పరిషత్ పరిషత్ పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో చదివిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు.వారంతా ఆనాటి ఉపాధ్యాయులు హరనాథరావు, సీహెచ్ రమణతోపాటు వలంటీర్లు రవిరాజు, జి.పట్నాయక్‌లకు సన్మానిం చారు. కుటుంబ సమేతంగా 20 ఏళ్ల తర్వాత కలిసి సందడిగా గడిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

● *గూగుల్ మ్యాప్ ద్వారా రాంగ్‌రూట్‌లో వెళ్లి వైనం*

● *మణిగ ఘాట్‌రోడ్డులో ఇరుక్కుపోయిన లారీ*

భామిని:చత్తీస్‌ఘడ్ నుంచి విశాఖ వెళ్తున్న ఓ లారీ గూగు ల్ మ్యాప్ ద్వారా రాంగ్‌రూట్‌లో వెళ్లి మణిగ ఘాట్‌రోడ్డులో శనివారం రాత్రి ఇరుక్కుపోయిం ది. వాస్తవంగా గుణుపూర్,బత్తిలి, భామినిమీదుగా వెళ్లాల్సిఉంది. గుణుపూర్, గొట్లభద్ర, మణిగ మీదుగా వెళ్లడం వల్ల రహదారి ఇరుగ్గా ఉండడంతో మలుపు వద్ద తుప్పల్లో ఇరుక్కో వడంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహ రించడం వల్ల త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. మరో ఐదు అడుగులు ముందుకు వెళ్తే లోయలో పడే ఉండేది. యంత్రం సాయంతో ఆదివారం లారీని బయటకు తీశారు. తర్వాత భామిని మీదుగా విశాఖ తరలింది.


ఘాట్‌రూట్‌లో నిలిచిపోయిన లారీ

రామ్మోహన్‌నాయుడుకు అభినందన

పాలకొండ: కేంద్ర విమానయానశాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నా యుడును పాలకొండ జడ్పీ టీసీ మాజీ సభ్యుడు సామం తుల దామోదరరావు ఆదివా రం కలిశారు. ఈ మేరకు కోటబొమ్మాళి మండలంలోని నిమ్మాడక్యాంప్ కార్యాలయం లో అభినందించారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు పైల సత్తిబాబు, మజ్జి జయశంకర్, ఎన్ని బాబ్జీ, ఎన్ని గోవింద ఉన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి పాలకొండ నియోజకవర్గ స్థితిగతులను దామోదరరావును అడిగితెలుసుకున్నారు.


రామ్మోహన్‌నాయుడును కలిసిన సామంతుల దామోదరరావు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

● 11 మందికి గాయాలు

ఒడిశా

రాయగడ: జిల్లా కేంద్రానికి 6 కిలోమీటర్ల దూరం లో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, 11 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రా వైపు నుంచి రాయగడ వైపు బైకుపై వస్తున్న యువకులు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్నారు. దీంతో బైకు నడుపుతున్న గణేష్ పిడికాక అనే యువకుడు ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ఒత్తాడ, శేషికల్ కంచికవలసకు చెందిన ప్రయాణికులతో వస్తున్న ఆటో ఇదే ప్రమాదంలో బోల్తా పడడంతో ప్రమాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ ఘటనా స్థలానికి చేరుకుని దగ్గరుండి సహాయక చర్యలను పర్యవేక్షించారు. క్షతగాత్రులను జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన డెకగుడకు చెందిన సత్యమండంగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూములు ఇప్పించండి

● *మంత్రి సంధ్యారాణిని కలిసిన పాయకపాడు రైతులు*


మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సాలూరు: కబ్జాదారుల నుంచి తమ భూమి తమకు ఇప్పించాలని మక్కువ మండలంలోని పాయకపాడు గ్రామానికి చెందిన గడే కురిమినాయుడు తదిత రులు కోరారు.ఈమేరకు ఆదివారం సాలూరులో మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు.అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. పూర్వీకుల నుంచితమకు సంక్రమించిన భూములు ఎ.వెంకంపేటకు చెందిన పెంట తిరుపతిరావుతోపాటు పెంట రాఘవ రామచంద్రరావు, ఆయన మనుషులు స్వాధీనంచేసుకున్నారని తెలిపారు. కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా భూములు ఇవ్వడం లేదని వాపోయారు. రాష్ట్ర మంత్రిగా తమ భూములు తమకు దక్కేలా చర్యతీసుకోవాలని కోరారు. రైతులు కోట్ల సింహాచలం, బెవర సత్యనారాయణ, బెల్లాన కొత్తన్న తోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

తక్షణమే సమస్య పరిష్కరించండి

● *పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర*


సమస్యను ఎమ్మెల్యేకు వివరిస్తున్న గొట్టాపు వెంకటరమణ

పార్వతీపురం రూరల్: తక్షణమే ప్రజల సమస్య పరిష్కరించాలని పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర అధికారులను ఆదేశించారు. మండలంలోని నర్సిపురంలో కాలువద్వారా మురుగునీరు పూర్తిగా బయటకు వెళ్లడానికి నిర్మించారు. ఇక్కడ వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక మిల్లు నుంచి రైల్వే ట్రాక్ వరకు సుమారు రూ.30లక్షల అంచనాలతో కాలువఏర్పాటుచేశారు. కానీ కాలువ నిర్మాణంలోఉన్న లోపాలవల్ల ప్రస్తుతం మురుగునీరు ఎస్సీ కాలనీలోకి చేరుతోంది. దీంతోకాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయచంద్ర ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే ప్రజల ఇబ్బందులనుతొలగించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో కాలువలు నిర్మించిన తర్వాత వాటి ద్వారా మురుగునీరు పూర్తిస్థాయిలో బయటకు వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఉండాలి గానీ కాలువలో నిర్మాణం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఉంటే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టాపు వెంకటరమణ, ఎంపీటీసీ తవిటినాయుడుతో పాటు పలువురు టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మనకీబాత్ వినాలి: ఎమ్మెల్యే

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం విన్నారు. ఈ కార్యక్రమం ప్రతిఒక్కరూ వినాలని ఎమ్మెల్యే ఈసందర్భంగా కోరారు. మంచి సందేశాలను ఈ కార్యక్రమం ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి దేశం మొత్తం మీద అపూర్వమైన స్పందన ఉందని చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ తన ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే ఈ కార్యక్రమానికి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. బీజేపీ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విజయ్‌చంద్రకు మొక్కలను అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, గొట్టాపు వెంకటనాయుడు, సిరిపురపు భాస్కరరావు, జి.రవికుమార్, ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అరకు కాఫీలో జీసీసీ కీలక పాత్ర

● *మన్‌కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంస*

గుమ్మలక్ష్మీపురం:అరకు వ్యాలీ కాఫీ స్థాయిని ప్రపంచ స్థాయిలో విస్తృతంగా చేయడంలో గిరిజన సహకార సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని నరేం ద్ర మోదీ ప్రశంసించారు. ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమంలో భాగంగా దేశ ప్రజల నుద్దేశించి మాట్లాడారు. అల్లూరి జిల్లా మన్యం ప్రాంతంలో గిరిజన సహకార సంస్థ ఏపీ ప్రభుత్వ సహకారంతో గిరిజనులు సాగుచేస్తున్న అరకు వ్యాలీ కాఫీ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. గతంలో విశాఖపట్నం సందర్శించిన సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి అరకు కాఫీను ఆస్వాదించే అవకాశం లభించిందని ప్రధాని తెలిపారు. అప్పట్లో చంద్రబాబుతో కలిసి కాఫీతాగుతున్న ఫొటోలను ప్రదర్శించారు.కాగా అల్లూరి జిల్లాలో అరకు వ్యాలీ సాగు, గిరి జనులకు రాష్ట్ర ప్రభుత్వం జీసీసీకి అందజేస్తున్న ప్రోత్సాహాన్ని ప్రధాని మోదీ ప్రస్తావించడం గర్వకారణంగా ఉందని జీసీసీ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్‌కుమార్ తెలిపారు.గిరిజనుల ఆర్థిక సాధికారితకు అరకు కాఫీ ఎంతగానో ఊతమిస్తోందని చెప్పారు.

జంపరకోట పనులు పూర్తిచేయాలి

● *పాలకొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి*

సీతంపేట: జంపరకోట రిజర్వాయర్ పనులు పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలని పాలకొండ నియోజకవర్గ టీడీపీ ఇన్ చార్జి పడాల భూదేవి కోరారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూ ర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పలు పెండింగ్‌లో ఉన్న పనులు ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు. తోటపల్లి కాలువల ఆధునికీకరణ, సవరభాష వలంటీర్లను రెన్యూవల్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, టీడీపీ కార్యకర్తలపై వైసీపీ హయాంలో పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు చెప్పారు.


చంద్రబాబునాయుడును కలిసిన భూదేవి

మేట్రిన్లకు విధులు అప్పగించాలి

గుమ్మలక్ష్మీపురం:గిరిజన సంక్షేమశాఖ అధికారులు ఆదేశాల మేరకు ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్థానంలో డిప్యూటీ వార్డెన్లగా మేట్రిన్లకు విధులు అప్పగించాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు పల్ల సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినా పలు చోట్ల ఆశ్రమ పాఠశాలల్లో ఆదేశాలు అమలు చేయడం లేదని, ఈ విషయంపై ఐటీడీఏ అధికారులు దృష్టిసారించాలని కోరారు. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమ విద్యా సంస్థలో సెకండరీ గ్రేడ్ టీచర్లు, వ్యాయామ ఉపాధ్యాయులకు విధులను అప్పగించాలని తెలిపారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో పలు ఆశ్రమ, వసతిగృహాల్లో స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్ పండిట్లకు, డిప్యూటీ వార్డెన్లను నియమిస్తున్నారని, ఇది ప్రభుత్వ నియమాలకు విరుద్ధమని పేర్కొన్నారు. అటువంటి వారిని తక్షణమే తొలగించి కేవలం ఎస్‌జీటీలకు మాత్రమే డిప్యూటీ వార్డెన్లగా నియమించాలని కోరారు.

60 మందికి నేత్రవైద్య పరీక్షలు

సాలూరు: పట్టణంలో రిటైర్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 60 మందికి కంటి పరీక్షలు చేశారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

గరుగుబిల్లి: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రావుపల్లి సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు కోరారు. రావుపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్య క్రమంలో మాజీ సర్పంచ్ గుళ్ల కాశినాయుడు, హెచ్ఎం జానకమ్మ, కుసిరెడ్డి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేటలో వైద్య శిబిరం

సీతానగరం (బలిజిపేట): బలిజిపేట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం విశా ఖపట్నం అనిల్ నీరుకొండ ఆసుపత్రి సౌజన్యంతో నాయు డు డాక్టర్స్ ప్లాజా ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే బోనెల విజ యచంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమం లో శిబిర నిర్వాహకుడు శ్రీనివాసనాయుడు, టీడీపీ మండల అధ్య క్షుడు పెంకి వేణుగోపాల్‌నాయుడు, జి.బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో అవస్థలు

మక్కువ: మక్కువలో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. కరెంట్ ఇచ్చి ఐదు నిమిషాల వ్యవధిలోనే నిలిపివేయడంతో చిరు వ్యాపారులు,దర్జీలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. చిన్నారులు, బాలింతలు, వృద్ధులు తీవ్ర ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. దీనికితోడు లోటట్టేజ్ వల్ల ఫ్యాన్లు, బల్బులు కాలిపోతున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కోత వల్ల రాత్రి వేళల్లో దోమలతో నిద్ర కరువవుతోందని పలువురు వాపోతున్నారు. విద్యుత్ సరఫరా తరచూ నిలిచిపోతుండడంతో తాగునీటి పథకా లకు నీరు సరఫరాకాకపోవడంతో ఇబ్బందిపడుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు స్పందించి విద్యుత్ సరఫరాను సక్రమంగా ఇవ్వాలని కోరారు.

సాగు నీరందేలా చర్యలు తీసుకోండి

● *ఎమ్మెల్యే జగదీశ్వరిని కలిసిన జనసేన నాయకులు*

గరుగుబిల్లి: జంఝావతి కాలువల ద్వారా ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగు నీరందేలా చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు మర్రాపు రవికుమార్, కేతిరెడ్డి అశోక్‌కుమార్, బోను శివ, ధర్మారావు, చంద్రశేఖర్, మంత్రబుడ్డి వెంకట నాయుడు కోరారు.ఈ మేరకు ఆదివారం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కలిసి మండలంలోని పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. మండలంలోని పలు గ్రామాల నుంచి పార్వతీపురంలోని కళాశాలలకు వెళ్తున్న విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ బస్సులు తిరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు.


జగదీశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జనసేన పార్టీ నాయకులు

సేవలే గుర్తింపునిస్తాయి


పెదకోటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న అధికారులు

గరుగుబిల్లి: ఉద్యోగులకు సేవలే మంచి గుర్తింపునిస్తాయని ఎంపీడీవో పైల సూర్యనారాయణ తెలిపారు. ఉల్లిభద్ర పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఉప్పల పెదకోటేశ్వరరావు పదవీ విరమణ సందర్భంగా ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన్ని ఘనంగా సన్మానించారు. ఏవో అర్జునరావు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది జి.ప్రవీణ్‌కుమార్, టి.శ్రీనివాసరావు, జి.కృష్ణప్రసాద్, ఎ.శ్రీకాంత్, ఆర్.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరిలో ఆధ్యాత్మికత అవసరం

పాలకొండ: ప్రతిఒక్కరిలో ఆధ్యాత్మికత అవసరమని ఆధ్యాత్మికవేత్త, సత్యసాయి ప్రతినిధి ఎన్‌వీ రమణ తెలిపారు. ఆదివారం మండలంలోని పనుకు వలస సత్యసాయి మందిరంలో పాలకొండ సత్యసాయిసేవాసమితి బృందం ఆధ్వ ర్యంలో సత్యసాయి వ్రతాలు, అనంతరం సత్సంగం నిర్వహించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

వీరఘట్టం: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఆదివారం వీరఘట్టంలోని డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు.ద్విచక్ర వాహనచోదకులు విధిగా తమ వాహనాలకు సంబంధించిన ప త్రాలు ఉండాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తే అపరాధ రుసుం తప్పదని హెచ్చరించారు.

బెలగాంలో దేశమ్మతల్లి వారాలు


ఘటాలతో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని బెలగాంలోగల సాయిరాం కాలనీ, గొల్ల వీధి, గాంధీనగర్, తదితర వీధుల ఇలవేల్పు దేశమ్మతల్లి వారాలను ఆదివారం పడాల, బొట్టవారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఎని మిది గంటల సమయంలో పార్వతీపురం రైల్వేస్టేషన్ సమీపంలోని అమ్మవారి వనం గుడి వద్ద పడాల, బొట్టవారి కుటుంబ పెద్దలు ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా వీధుల్లో మేళ తాళాలు, విచిత్రవేషధారణల మధ్య అమ్మవారి ఘటాల ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈసందర్భంగా పడాల, బొట్ట వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గరుగుబిల్లిలో సుదర్శన హోమాలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయం లో ఆదివారం సుదర్శన హోమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న రుత్వికులు